ప్రజాశక్తి
శనివారం 7 డిసెంబర్ 2024 5 విజయనగరం

గొర్రెల పెంపకందార్లను ఆదుకోవాలి

సిపిఎం, ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలో ఇటీవల వరి కంకులు (వరి వెన్నులు) తిని మృతి చెందిన గొర్రెలకు నష్టపరిహారం ఇచ్చి పెంపకం దారులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్.గోపాలం, బి.రాంబాబు లేఖ రాశారు. ఇటీవల జిల్లాలో కత్తెర పురుగు, కొమ్ము పురుగు వరి పంటను ఆశించి చేతికి వచ్చిన వరి పంటలో వరి కంకులను కత్తిరించి రైతులకు నష్టం కలిగించిన విషయం తెలిసిందేనని అన్నారు. కత్తెర పురుగు కారణంగా నేలరాలిన వరి కంకులను తిన్న గొర్రెలు మత్యువాత పడుతున్నాయని తెలిపారు. ఇటీవల గంట్యాడ మండలం బుడతనాపల్లిలో 5 గొర్రెలు బొండపల్లి మండలం రయాంద్రంలో 40గొర్రెలు, మూడు రోజుల క్రితం నెల్లిమర్ల మండలం పెద్దబూరాడపేటలో 80గొర్రెలు మృతి చెందాయని తెలిపారు. వెంటనే వీటికి కారణాలు పరిశీలించి నివారణ చర్యలు తీసుకోవాలని,పెంపకం దారులకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- సేవలన్నీ ఉచితం : కలెక్టర్
- రెవెన్యూ సదస్సులు ప్రారంభం



రైతు నుంచి అర్జీని స్వీకరిస్తున్న మంత్రి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి/విజయనగరం కోట

రెవెన్యూ సదస్సుల ద్వారా 45 రోజుల్లో భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బొండపల్లి మండలం గొట్లాం గ్రామంలో రెవెన్యూ సదస్సులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సదస్సులో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని తాహశీల్దార్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలనుంచి వస్తున్న వినతుల్లో ఎక్కువ భాగం భూ సమస్యలేనని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే ప్రక్రియలో పలు లోపాలు చోటుచేసుకున్నాయని, దీనివల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సరైన విధానం, మార్గదర్శకాలు లేకుండా, తగిన సమయం ఇవ్వకుండా హడావిడిగా సర్వే చేయించారని అన్నారు. రీసర్వేలో జరిగిన లోపాలపై సుమారు 9వేలకు పైగా దరఖాస్తులు రావడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతీఒక్కరూ తమ భూముల రికార్డులను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ-గవర్నన్స్ విధానంలో వాట్సాప్ గవర్నన్స్ విధానాన్ని మంత్రి లోకేష్ రూపొందిస్తున్నారని, వాట్సాప్ ద్వారానే తమకు కావాల్సిన ధ్రువపత్రాలను, ఇతర సేవలను పౌరులు పొందవచ్చునని మంత్రి తెలిపారు.

జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రభుత్వ సేవలన్నీ పూర్తిగా ఉచితంగా పొందవచ్చునని, ప్రజలు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 70 శాతానికి పైగా అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వస్తున్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం, సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. జిల్లాలోని 968 రెవెన్యూ గ్రామాల్లో కూడా సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. వీలైనంత వరకు అక్కడికక్కడే సమస్యలను పరిష్కరించేందుకు ప్రాధాన్యతను ఇస్తున్నామని చెప్పారు. జిల్లా అధికారులు, డిప్యూటీ కలెక్టర్లతోపాటు అన్ని శాఖల అధికారులను సదస్సులవద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. వచ్చిన ఆర్జీలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరిస్తామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ మాట్లాడుతూ, రోజుకో గ్రామం చొప్పున మొత్తం 33 రోజులపాటు సదస్సులను నిర్వహించేందుకు షెడ్యూల్‌ను రూపొందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ప్రమీలా గాంధీ, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ సుధారాణి, సర్వేశాఖ ఎడి రమణమూర్తి, తాహశీల్దార్ డి.రాజేశ్వర్రావు, ఇతర రెవెన్యూ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్

విజయనగరం కార్పొరేషన్ పరిధి అయ్యన్నపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వినతులను ఇవ్వడానికి వచ్చిన ప్రజల సమస్యలపై ఆరా తీశారు. వచ్చిన కొన్ని అర్జీలపై అక్కడికక్కడే వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, సహాయ కమిషనర్ తిరుమలరావు, మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఆర్ఎస్ జాన్, తాహశీల్దార్ కూర్మనాథ్, కార్పొరేషన్ ఎసిపి హరిబాబు, రమణమూర్తి, సర్వేయర్ సింహాచలం, గ్రూప్ టెంపుల్స్ ఇఒ కె.పద్మావతి, సబ్ రిజిస్ట్రార్ టి.రమేష్, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలతోబాటు డాక్యుమెంట్స్ జతచేయాలి : కలెక్టర్

రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు ఇచ్చే వినతులతోపాటు, దానికి సంబంధించిన డాక్యుమెంట్‌లను కూడా జత చేయాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచించారు. కొంతమంది కేవలం దరఖాస్తు మాత్రమే ఇస్తున్నారని, దీనికి సంబంధిత భూములకు సంబంధించిన ధ్రువపత్రాలను, పాస్ పుస్తకాలను, రసీదులు, ఇతర డాక్యుమెంట్ల నకళ్లను జత చేయాలని చెప్పారు. రెవెన్యూకు సంబంధించిన చిన్నపాటి సమస్యనైనా అధికారుల దష్టికి తీసుకురావచ్చునని చెప్పారు.

బకాయి జీతాలు చెల్లించాలి

- పేరెంట్‌కు రూ.30 చెల్లిస్తే తప్ప మంచి భోజనం పెట్టలేం
- ఎంఇఒ కార్యాలయం వద్ద ఎండిఎం కార్మికులు, ఆయాల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు, వాచ్‌మెన్‌లకు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 5 నుంచి 3 నెలల జీతాలు, బిల్లుల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఎ. జగన్మోహన్‌రావు, ఆయాల సంఘం అధ్యక్షులు ఎస్‌కె బేగం, టి.లక్ష్మి మాట్లాడుతూ నెలల తరబడి జీతాలు బిల్లులు, చెల్లించకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. వెంటనే జీతాల బకాయిలు చెల్లించాలని, లేదంటే ఈనెల 16న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని ప్రకటించారు. శనివారం జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి హాజరయ్యే తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి 30 రూపాయలు చొప్పున మెనూ ఛార్జీ ఇస్తే తప్ప బాగా వండి పెట్టలేమన్నారు. ధరలు విపరీతంగా పెరిగాయని, పిల్లాడికిచ్చే తొమ్మిది రూపాయలతోనే మంచి భోజనం పెట్టమంటే సాధ్యం కాదన్నారు. భోజనాల ఖర్చులు ముందుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి 50 మందికి ఒక ఆయాను నియమించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, ఇఎస్ఐ,పిఎఫ్ , ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పార్వతి, ఉమా, కామేశ్వరి, శారద, మాధవి, శ్యామల, స్వాతి, సత్య, రేవతి పాల్గొన్నారు.

రామభద్రపురం : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యాన స్థానిక ఎంఆర్‌సి వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం మెనూ ఛార్జీ 31 పైసలు మాత్రమే పెంచడం దారుణమన్నారు. ఒక్కో విద్యార్థికి మెనూ ఛార్జి కింద 20 రూపాయలు ఇవ్వాలని, కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని డిమాండ్‌చేశారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట గ్యాస్ ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చిన్నమ్మలు, తెంటు సరోజిని, లక్ష్మి, ఈశ్వరరావు, తవుడమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు, సిఐటియు నాయకులు

ఆర్‌అండ్‌బి అతిథి గృహం స్థలంలో డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలి

- 9న మంత్రి లోకేష్‌కు ఇ-మెయిల్, 11న సంతకాల సేకరణ
- 16న ఐక్య కార్యాచరణ సమావేశం ఏర్పాటు
- పట్టణ పౌరసంక్షేమ సంఘం పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యా అభివృద్ధికి కృషి చేస్తామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం జిల్లా కేంద్రంలో డిగ్రీ కాలేజికి సొంత భవనాన్ని ఆర్‌అండ్‌బి అతిథిగృహం స్థలంలో నిర్మించాలని, దాన్నే విద్యా హబ్ కింద మార్చాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో నేడు బిఇడి, పీజీ , లా కళాశాలలు ఎత్తేసారన్నారు. ఇప్పుడు చదవాలంటే విశాఖ పట్నం వెళ్ళి చదువుకోవా లన్నారు. నేడు విజయనగరం విద్యాహీనంగా మారుతోందన్నారు. శ్రీకాకుళం పట్టణంలో 10 మున్సిపల్ హై స్కూల్స్ ఉంటే విజయనగరంలో దశాబ్దాలుగా కేవలం మూడే మున్సిపల్ స్కూల్స్ ఉన్నాయన్నారు. జనాభాకనుగుణంగా మున్సిపల్ స్కూళ్ల కోసం శిల్పారామం వద్ద 20 ఎకరాలు కేటాయించాలన్నారు. విజయనగరంలో ఉన్న ఏకైకమహిళా కాలేజిని ఎత్తేసి అమ్మాయిలను చదువుకు దూరం చేసారన్నారు. కావున విజయనగరంలో విద్యాభివృద్ధికి విద్యాశాఖ మంత్రి , విజయనగరం ఎంఎల్ఎ కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9న విద్యాశాఖ మంత్రికి ఈ మెయిల్ పంపే కార్యక్రమం, 11న సంతకాల సేకరణ, 16 న ఐక్య కార్యాచరణ సమావేశం జరుపుతామని,అందులో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని చెప్పారు. అనంతరం పోరాట కార్యక్రమం గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు యుఎస్ రవికుమార్, ఆర్. శ్రీను, రామచంద్రరావు, సుదీర్ పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు కీలకం

- అదనపు ఎస్‌పి సౌమ్యలత
- ఘనంగా హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎస్‌పి సౌమ్యలత

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు క్రియాశీలకంగా ఉన్నాయని అదనపు ఎస్‌పి (అడ్మిన్) పి.సౌమ్యలత అన్నారు. 62వ హోంగార్డ్సు ఆవిర్భావ దినోత్సవం పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అతిథులుగా ఎఎస్‌పి సౌమ్యలత, ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు హాజరై హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ప్రారంభ సూచికగా శాంతి కపోతాలను ఎగురవేసారు.ఈ సందర్భంగా ఎఎస్‌పి సౌమ్యలత మాట్లాడుతూ పోలీసులు నిర్వహించే అన్ని రకాల బందోబస్తులు, ముఖ్య వ్యక్తుల భద్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్, వివిధ విభాగాల్లో హోంగార్డులు సమర్ధవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలీసు ఉద్యోగుల వలే సాంకేతిక పరిజ్ఞానంను పెంపొందించుకొని, కంప్యూటరు ఆపరేటర్లగా, డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. అంకితభావంతో పని చేసి జిల్లా పోలీసుశాఖకు మంచి పేరును తీసుకు రావాలని కోరారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చేసుకున్నామని, సర్వీసులో ఉంటూ ప్రమాదం లేదా ఆనారోగ్య కారణాలతో మృతి చెందిన హోంగార్డు కుటుంబాలను, ఉద్యోగ విరమణ చేసిన వారిని ఆర్థికంగా ఆదుకొనేందుకు 'చేయూత' అందిస్తున్నామన్నారు. రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహించి, ప్రజలకు సహాయకారిగా మెలగాలని హోంగార్డులకు పిలుపునిచ్చారు. ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ - పోలీసులతో సమానంగా అన్ని రకాల విధులు నిర్వహిస్తూ, జిల్లా పోలీసుశాఖను రాష్ట్రంలోనే ఉత్తమంగా నిలిపారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో పని చేయాలని సూచించారు. అనంతరం, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హోంగార్డుకు, నీట్ టర్నవుట్, పరేడ్ నిర్వహణలో ప్రతిభ కనబర్చిన హెూంగార్డుకు అదనపు ఎస్పి బహుమతులు ప్రదానం చేసారు. ఇటీవల మరణించిన హోంగార్డు కుటుంబాలకు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ తరువున రూ.3000 చెక్‌లను అంజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీని పోలీసు కార్యాలయం వద్ద అదనపు ఎస్పీ పి.సౌమ్యలత పచ్చ జెండాను ఊపి ప్రారంభించారు. ర్యాలీని పోలీసు కార్యాలయం నుండి దిశ పోలీసు స్టేషనువరకు నిర్వహించి, మానవ హారంగా ఏర్పడి, హెూంగార్డ్సు విధులు, సేవలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు, సిఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యుత్తు స్మార్ట్‌మీటర్లను అడ్డుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు ప్రజలను కోరారు. పట్టణంలో షాపులకు విద్యుత్తు శాఖాధికారులు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేశారు. వాటిని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంతో ప్రభుత్వ కార్యాలయాలు, షాపులు, ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. స్మార్ట్ మీటర్లకు రీఛార్జి చేసుకోవాలని, అర్ధరాత్రి రీఛార్జి ముగిసి, విద్యుత్తు సరఫరా నిలిచిపోతే ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

నేడు రౌండ్‌టేబుల్ సమావేశం.. విద్యుత్తు ఛార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శనివారం స్థానిక బృందావనం ఫంక్షన్ హాల్లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని శంకరరావు చెప్పారు. దీనికి స్వచ్ఛంద సంస్థలు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వైద్య ఆరోగ్య శాఖలో మగ ఆరోగ్య కార్యకర్తలను కొనసాగించి ఉద్యోగ భద్రత కల్పించాలని యునైటెడ్ మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె.లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి వివి మూర్తి, ఉపాధ్యక్షులు జెవివి ప్రసాద్ ప్రభుత్వాన్ని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. 2001, 2002లో జీవో 217, జీవో 459 ద్వారా, 273, 1207 జిఒల ద్వారా వివిధ జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా వీరిని నియమించారని తెలిపారు. వీరు దాదాపు 1500 వందలు వరకు ఉన్నారని, 20ఏళ్లనుంచి ఉద్యోగ బాధ్యతల్లో ఏనాటికైనా రెగ్యులర్ అవుతామన్న ఆశతో అర కొర వేతనాలతో సేవలందిస్తున్నారని అన్నారు. కానీ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఆదేశాలు ఇవ్వడం అన్యాయమన్నారు. వీరంతా కోవిడ్ సమయంలో కూడా ఉన్నత సేవలు అందించారన్నారు. కనుక ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖామంత్రి స్పందించి వీరిని కొనసాగించాలని కోరారు.

నీటి నమూనాలు సేకరణ

ప్రజాశక్తి-రేగిడి

చెరువును పరిశీలిస్తున్న ఇఇ సరిత

సంకిలిలోని నాయుడు చెరువు, చిన్నయ్యపేటలోని అవుట్ చెరువుల నీటి నమూనాలను సేకరించామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇ బిబి సరిత తెలిపారు. సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్, అనుబంధ సంస్థ ఇథనాల్ ప్లాంట్ నుండి వచ్చే రసాయన వ్యర్థాల కారణంగా చెరువులు కలుషితమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయా చెరువుల్లో నీటి నమూనాలను శుక్రవారం సేకరించారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు ఇఇ సరిత తెలిపారు. ఇథనాల్ ప్లాంట్ నుంచి చెరువులోకి వచ్చిన నీటి శ్యాంపిల్స్‌ను విశాఖపట్నం ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. చెరువులు కలుషితమైనట్లు నిర్ధారణ అయితే ఇఐడి ప్యారి సుగర్స్ యాజమాన్యంపై కేసులు తప్పవన్నారు. ముందుగా చెరువులోకి వస్తున్న నీటిని అరికట్టేలా యాజమాన్య ప్రతినిధులకు సూచించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఇఐడి ప్యారీ పరిశ్రమ అసోసియేట్ సీనియర్ ఉపాధ్యక్షులు పట్టాభిరామిరెడ్డి 'ప్రజాశక్తి'తో ఫోన్లో మాట్లాడుతూ చెరువుల్లో వ్యర్థ రసాయనాలు వదలడం లేదన్నారు. విలువైన రసాయన ట్యాంకర్లు ఉంచుతున్నట్లు తెలిపారు. గతంలో పంటల దిగుబడులకు చెరువుల ద్వారా నీరు అందించాలని రాతపూర్వకంగా రైతులు ఇచ్చారని, వారి కోరిక మేరకే నీరు వదిలామని తెలిపారు. రైతులు నీరు వద్దంటే పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

ప్రజాశక్తి-శృంగవరపు కోట



ఆఫర్ లెటర్లతో అభ్యర్థులు, ప్రిన్సిపల్ కేశవరావు, తదితరులు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి 120 మందికి పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో 42 మందికి ఉద్యోగావకాశాలు లభించాయని కళాశాల జెకెసి కోఆర్డినేటర్ జి.ఈరన్న తెలిపారు. ఎంపికైన వారికి ప్రిన్సిపల్ కేశవరావు ఆఫర్ లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ భాస్కరరావు పాల్గొన్నారు

ఆర్‌యుబి నిర్మించాలని వినతి

ప్రజాశక్తి-గరివిడి

గరివిడిలో పాత రైల్వేగేటు ప్రాంతంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంత వ్యాపారులు, రామేశ్వర కాలనీ, బద్రిప్రసాద్ కాలనీ వాసులు.. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిమిడి నాగార్జునను కోరారు. చీపురుపల్లిలోని ఆయన నివాసంలో శుక్రవారం నాగార్జునను కలిశారు. గరివిడి పాత రైల్వేగేటు ప్రాంతంలో వందలాది మంది వ్యాపారులు, సమీప గ్రామాల ప్రజలకు రైల్వేవంతెన వద్ద పూర్తిగా దారి మూసివేయడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యకు అండర్ బ్రిడ్జి నిర్మాణంతో పరిష్కారం చూపాలని కోరారు.

ప్లాస్టిక్‌పై దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులపై దాడులు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. సచివాలయాల పరిధిలో ప్రతి దుకాణానికి వెళ్లిన కార్యదర్శులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. చిరు వ్యాపారుల నుండి కిరాణా షాపులు, టిఫిన్ దుకాణాలు వద్దకు వెళ్లి క్యారీ బ్యాగులు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు అపరాధ రుసుము విధిస్తున్నారు. ముఖ్యంగా ప్రజలలో ప్లాస్టిక్ వినియోగం పట్ల అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో చేపడుతున్న దాడుల వల్ల కొంతమేర ప్లాస్టిక్ వినియోగం తగ్గుముఖం పట్టిందని అన్నారు.

న్యాయవాదులకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

మధ్యవర్తిత్వం, ప్రత్యామ్నాయ వివాద పరిష్కారం అంశాలకు సంబంధించి జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్లో న్యాయవాదులకు శుక్రవారం సెన్సిటైజేషన్ ప్రోగ్రాం, ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి టివి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. మధ్యవర్తిత్వం ద్వారా కేసులు ఎలా పరిష్కరించాలి?, ఇరు పార్టీలతో మధ్యవర్తిత్వం ద్వారా పార్టీల మధ్య అవగాహన కుదిర్చి ఏ విధంగా రాజీ చేసి కేసులను ఎలా పరిష్కరించాలో వివరించారు.

విభిన్న ప్రతిభావంతులకు రుణాలు

ఎడి జగదీష్

వికలాంగురాలికి స్మార్ట్‌ఫోన్ అందజేస్తున్న ఎడి జగదీష్, తదితరులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విభిన్న ప్రతిభావంతులకు ఉపాధి కల్పించేందుకు రుణాలు మంజూరు చేస్తున్నామని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్దుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జివిడి జగదీష్ చెప్పారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమం ఆనంద గజపతి ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎడి మాట్లాడుతూ తమ శాఖ పరంగా వికలాంగుల సంక్షేమానికి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని, విభిన్న ప్రతిభావంతులు ఉపాధి పొందాలని కోరారు. మెప్మా పీడీ చిట్టి రాజు మాట్లాడుతూ దివ్యాంగులు అందరికీ ఆదర్శంగా ఉంటూ వివిధ రంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. వారికి శాఖా పరంగా ఇస్తున్న రుణాల గురించి తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ కెఆర్‌డి ప్రసాద్ మాట్లాడుతూ, విభిన్న ప్రతిభావంతుల్లో నాయకత్వ లక్షణాలు వెలికితీయడం, ఈ సంవత్సరం విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ థీమ్ అని పేర్కొన్నారు. మానసిక వికలాంగులను వారి వారి పనులు చేసుకునేలా తయారు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వారికి ల్యాప్‌టాప్‌లు, టచ్ ఫోన్లు అందజేశారు. వివిధ రంగాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు, విభిన్న ప్రతిభావంతులకు సహాయం చేసిన వారికి సన్మానించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

కార్యక్రమంలో ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రిన్సిపాల్ మహేశ్వర్ రెడ్డి, ఒహెచ్ అసోసియేషన్ నాయకులు లక్ష్మణరావు, అంధ ఉద్యోగుల సంఘం నాయకులు ఉమా శంకర్, డెఫ్ అసోసియేషన్ టి సూర్యనారాయణ, నామినేటెడ్ సభ్యులు జి.లలిత తదితరులు మాట్లాడారు. వివిధ అసోసియేషన్లు, ఎన్‌జిఒలు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ప్రజాశక్తి-గంట్యాడ

ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట శుక్రవారం గ్రీన్ అంబాసిడర్ల సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా చేశారు. అనంతరం ఎంపిడిఒ రమణమూర్తికి వినతి అందించారు. గ్రీన్ అంబాసిడర్ల సంఘం జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ గ్రీన్‌అంబాసిడర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించక పోవడం దారుణమన్నారు. నాలుగు నెలల నుంచి ఏడాది వరకు బకాయిలు ఉంటే వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. వెంటనే బకాయి జీతాలు చెల్లించి, గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వై.సన్యాసిరావు, బి.రాము, ఎస్.శంకర్రావు, బి.అప్పారావు, సిహెచ్.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాలు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రానన్న వేసవిలో ప్రజలకు నీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇఇ టి.రాయల్‌బాబు తెలిపారు. ఇంజినీరింగ్ సిబ్బందితో ముషిడిపల్లి వాటర్ వర్క్స్ వద్దకు వెళ్లి అక్కడ నెలకొన్న పరిస్థితులను గమనించారు. ముందుగా ముషిడిపల్లి వాటర్ వర్క్స్ వద్ద ఇన్ఫిల్ట్రేషన్ విధానాన్ని, గ్యాలరీలు, స్లంపు వంటి వాటిని గమనించి వాటి పనితీరు పై ఆరా తీశారు. అన్ని సక్రమంగా ఉండడంతో పంపింగ్ అవుతున్న ప్రదేశానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అయితే అక్కడ చుట్టూ ఇసుక బస్తాలు ఉండడానికి గమనించారు. ఈ విధానం కొనసాగకుండా శాశ్వత పరిష్కార మార్గాలు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించే విషయమై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. ఆయన వెంట డిఇ మణికుమార్, సిబ్బంది ఉన్నారు.

రెవెన్యూ సదస్సులకు భారీగా ఫిర్యాదులు

●2019-24 మధ్య భూ మార్పులపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే లోకం నాగమాధవి ● మ్యుటేషన్లపైనే అధిక వినతులు

ప్రజాశక్తి-డెంకాడ

2019-24 మధ్యకాలంలో గత ప్రభుత్వం చేసిన భూమార్పిడిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశించారు. మండలంలో గుణుపూరుపేటలో రెవెన్యూ సదస్సులను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూ సమస్యలపై స్వీకరిస్తున్న అర్జీల కౌంటర్ వద్దకెళ్లి వాటిని పరిశీలించారు. అర్జీదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి బి.వెంకట వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మండల ప్రత్యేకాధికారి జమదగ్ని, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ వై.భవాని, సర్పంచ్ పైల ముత్యాలరావు, నాయకులు పాణి రాజు, చింతపల్లి రామ్మూర్తి, జనసేన మండల కోఆర్డినేటర్ పైల శంకర్, దిండి రామారావు, పైల శ్రీను పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలోని జన్నివలసలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును ఆర్‌డిఒ రామ్మోహనరావు, మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్‌కుమార్ సందర్శించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచన రాణి, ఎఫ్‌ఎస్‌ఒ నూకరాజు పాల్గొన్నారు.

డెంకాడ.. అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవి

వంగర : మండలంలోని అరసాడలో రెవెన్యూ సదస్సులో జిల్లా పరిషత్ సిఇఒ బివి సత్యనారాయణ, ఆర్‌ఒ జోసెఫ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ డి.ధర్మరాజు, ఎంపిడిఒ త్రినాథరావు, ఇఒపిఆర్‌డి కెల్ల రామారావు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని కాగాం, అరసబలగ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఒకే భూమి ఇద్దరి పేరిట ఉండటంపై ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. రెండు గ్రామాల్లో 35 అర్జీలు అందినట్లు తహశీల్దార్ హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడి విటి రామారావు, జెడ్‌పిటిసి ప్రతినిధి జి.రామారావు పాల్గొన్నారు.

రాజాం : మండలంలోని అంతకాపల్లి, విఆర్ అగ్రహారంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు నోడల్ అధికారి ఎన్.నిర్మల కుమారి హాజరయ్యారు. ఇనాం భూముల సమస్యను రైతులు అధికారుల దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీనిచ్చారు.

మా భూములను రెగ్యులర్ చేయండి

ఇటకర్లపల్లి రైతుల మొర

చీపురుపల్లి : దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పాస్ పుస్తకాలు ఇవ్వాలని ఇటకర్లపల్లి రైతులు రెవెన్యూ అధికారుల వద్ద మొర పెట్టుకున్నారు. మండలంలో ఇటకర్లపల్లిలో శుక్రవారం ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఆర్‌డిఒ జివి సత్యవాణి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎం.రాజేశ్వరి, నోడల్ అధికారి కె.హేమ సుందరరావు పాల్గొన్నారు. సుమారు 150 మంది రైతులు 200 ఎకరాలను సాగుచేస్తున్నామని, తమకు పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదని వారంతా వాపోయారు. రైతుల ఆక్రమణలో ఉన్న మన్నార్ రాజగోపాల స్వామి దేవస్థానం భూములకు టైటిల్ డీడ్, పాస్ పుస్తకాలు ఇవ్వాలని రైతులు కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, ఎంపిడిఒ ఎ.సరళ, సబ్ రిజిస్ట్రార్ టివికెఎస్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

అధికారులకు దరఖాస్తులు చేసుకుంటున్న బాధితులు

కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని చింతాడలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 24 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా మ్యుటేషన్లకు 16 అర్జీలు అందాయి. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ రామ్మోహనరావు.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.శ్రీను, మాజీ ఎంపిపి దామోదర్, మాజీ సర్పంచ్ జయప్రదీప్ పాల్గొన్నారు.

సంతకవిటి : మండలంలోని బొద్దూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మూడు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సత్యం, ఆర్ఐ కృపారావు, విఆర్‌ఒ గోవిందరావు, సర్పంచ్ గేదెల బాబూరావు, ఎంపిటిసి గణేష్ పాల్గొన్నారు.

భూములున్నాయి.. హక్కులు లేవు

వేపాడ : అనుభవంలో భూములున్నా, వాటిపై హక్కులు లేవని, గత రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్లే సమస్య తలెత్తిందని పాటూరు ఉపసర్పంచ్ కె.రమణమూర్తి, మాజీ సర్పంచ్ గంగునాయుడు.. అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని పాటూరులో తహశీల్దార్ రాములమ్మ ఆధ్వర్యాన నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రైతుల నుండి పది దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడో ఉన్న వారిపేరిట భూములున్నాయని, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇరువురిని కూర్చోబెట్టి పరిష్కారానికి కృషి చేస్తామని తహశీల్దార్ హామీనిచ్చారు. సదస్సుకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ తాత ముత్తాతల నుంచి ఉన్న సమస్యలను రెవెన్యూ అధికారులు సమావేశాలతో సరిపెట్టకుండా, సాగులో ఉన్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, సర్పంచ్ వెంకటలక్ష్మి, ఎంపిటిసి, ఉప తహశీల్దార్ సన్యాసినాయుడు, ఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న బ్రహ్మానందరెడ్డి

పూసపాటిరేగ : మండలంలోని గోవిందపురం రెవెన్యూ పరిధిలోని భరణికాంలో జగన్నాథ స్వామి, వేణుగోపాలస్వామి ఆలయాలకు చెందిన 3.20 ఎకరాల భూమిని చూపించాలని దేవాదాయ శాఖ మండల కన్వీనర్ నీలాపు బ్రహ్మానంద రెడ్డి.. రెవెన్యూ అధికారులను కోరారు.

దేవుడి భూములు చూపించండి

శుక్రవారం మండలంలోని గోవిందపురంలో నోడల్ అధికారి డి.అరుణ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయ భూమి సర్వే నంబర్ 167లో 3.03 ఎకరాలు ఉందని, దాన్ని హద్దులు చూపించి, దేవాదాయ శాఖకు అప్పగించాలని కోరారు. తహశీల్దార్ తాటి గోవింద్ స్పందించి దేవాలయ భూమిని హద్దులు చూపించి అప్పగిస్తామని చెప్పారు. సదస్సులో సర్పంచ్ బాల రామలక్ష్మి, ఉపసర్పంచ్ బాలా అప్పలరాజు, టిడిపి నాయకులు విక్రం జగన్నాథం, వైసిపి నాయకులు ఈశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై 100 ఫిర్యాదులు

భోగాపురం : మండలంలోని కౌలువాడలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై 100 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా భూముల ఆన్‌లైన్, వివాదాలు, సబ్ డివిజన్ వంటి సమస్యలపై 80 శాతం ఫిర్యాదులు చేశారు. తమ భూమిని బలవంతంగా ఆక్రమించుకుంటున్నారంటూ డెంకాడ మండలం ముంగినాపల్లికి చెందిన ఎస్.ప్రభావతి ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని వేరే వ్యక్తులు రౌడీలను పెట్టి, తన భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారని మార్క్ ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుకు విన్నవించారు. దీంతో ఆయన స్పందిస్తూ సర్వే నిర్వహించి బాధితులకు భూమి అప్ప చెప్పేలా చూడాలని తహశీల్దార్ ఎం.సురేష్‌కు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకట రామన్, ఎంపిడిఒ కిరణ్ కుమార్, సబ్ రిజిస్ట్రార్ రామకృష్ణ, ఆర్ఐ ఇమ్రాన్, నాయకులు కోరాడ తాతారావు, కొండపు రమణ, కొత్తయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమిని ఆక్రమించుకున్నారంటూ ఫిర్యాదు చేస్తున్న మహిళ

పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు కోండ్రు జగదీశ్

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-రాజాం

రాజాం మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం టిడిపి సీనియర్ నాయకులు కోండ్రు జగదీశ్ ప్రారంభించారు. పత్తి కొనుగోలులో జాప్యం, దళారుల దోపిడీపై ఇటీవల 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి, కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో క్వింటాకు రూ.7,521 మద్దతుధర ఇస్తున్నట్లు తెలిపారు. తొలుత అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజనులు

ప్రజాశక్తి-శృంగవరపు కోట

గిరిశిఖర గ్రామాల గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ గిరిజన సంఘం, దారపర్తి సర్పంచ్ సన్యాసిరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు జె.గౌరీష్ మాట్లాడుతూ గిరిజనులకు పోడు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. దబ్బగుంట నుండి పల్లపు దుంగాడ వరకు గత ప్రభుత్వంలో రహదారి నిర్మాణాన్ని ప్రారంభించి, కల్వర్టుల నిర్మాణాన్ని పూర్తిచేసి ఆపేశారని, వాటిని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్‌చేశారు. బొడ్డవర నుండి చిట్టెంపాడు వరకు రహదారి నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరు చేశారని, ఆ పనులను రూటు మార్చి వెంటనే ప్రారంభించాలని కోరారు. జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని జిసిసి ద్వారా నిర్వహించాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఎంపిడిఒ సండి సోమేశ్వరరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.

కళాఉత్సవ్ పోటీలకు ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. శుక్రవారం డైట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ఆరు అంశాల్లో ప్రథమ స్థానం సాధించిన ఆరుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ జి.పగడాలమ్మ తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా ఎం.ఆదియ్య, వి.నారాయణమూర్తి, ఎవిఆర్‌డి ప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో పి.రవికుమార్, కె.సూర్యారావు, స్టాఫ్ సెక్రటరీ డి.ఈశ్వరరావు, వివిజెఎస్ సుబ్రహ్మణ్యం, ఎ.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, వి.భారతి పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న కళాకారిణి

'సంకల్పం' ఫిర్యాదు పెట్టెను ఏర్పాటుచేస్తున్న వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్

పలుచోట్ల డ్రాప్ బాక్సులు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల వినియోగం, రవాణా వంటి వలన జరిగే నష్టపరిహారం, నమోదు చేయబడే కేసులు, వాటి శిక్షలు తదితర అంశాలను వివరిస్తూ సంకల్పం పోస్టర్స్‌ను , గంజాయి వాడకం , రవాణా వివరాలు తెలియ పరచడానికి డ్రాప్ బాక్స్‌లను పలుచోట్ల ఏర్పాటు చేసినట్లు వన్‌టౌన్ సిఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్సు, రైల్వేస్టేషను, మహారాజ ప్రభుత్వ ఆసుపత్రికి పరిసరాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ డ్రాప్ బాక్స్‌లను వారానికి ఒకసారి చెక్ చేసి అందులో ఇచ్చిన వివరాలను గోప్యతగా ఉంచి గంజాయి అక్రమ రవాణా గురించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న న్యాయమూర్తి దామోదరరావు

కేసుల రాజీతో సత్వర న్యాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

మధ్యవర్తిత్వంతో కేసులను రాజీ చేస్తే సత్వర న్యాయం లభిస్తుందని పార్వతీపురం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదరరావు అన్నారు. స్థానిక కోర్టులో శుక్రవారం మధ్యవర్తిత్వం ద్వారా కేసుల రాజీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టులో పెండింగులో ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో రాజీ చేస్తే ఇరువురికి సత్వర న్యాయం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మోహన్ మురళికుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు వారణాసి లో జరగనున్న ఆలిండియా అండర్-14 బాయ్స్, గర్ల్స్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న ఎపి వాలీబాల్ టీమ్‌కు కిట్స్ అందజేసి డిఇఒ యు. మాణిక్యం నాయుడు, డిప్యూటీ డిఇఒ వెంకటరమణ, డిఎస్‌డిఒ వెంకటేశ్వరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా దుస్తులను డిఇఒ ఓ చేతులు మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పోటీల్లో బాగా రాణించి మొదటి స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను అభినందించిన వారిలో ఎపి వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టివి భగవాన్ దాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సెక్రటరీ కెవిఎన్ రాజు, కె.కృష్ణ, కోచ్ దేవమణి, కె.రమణ పాల్గొన్నారు

నిరాశ్రయులకు అల్పాహారం వితరణ

ప్రజాశక్తి-విజయనగరం

విశాలాంధ్ర విలేకరి మరుపల్లి ప్రతాప్ కుమార్తె మరుపల్లి హాసిని పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం జిల్లా అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల భవనంలో వృద్ధులకు అల్పాహార పొట్లాలు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు తదితర వేడుకలలో నిరాశ్రయులను ఆదుకునేందుకు తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు బాలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు, కలెక్టర్ అంబేద్కర్

అంబేద్కర్‌కు ఘన నివాళి

భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, పలు సంఘాల నాయకులు అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమిద్దామని అన్నారు. జనసేన నాయకులు గురాన అయ్యలు, అవనాపు విక్రమ్ ఆ పార్టీ కార్యాలయంలో నివాళులర్పించారు.

- ప్రజాశక్తి, విలేకర్ల బృందం

వేపాడ మండలం సింగరాయిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలి అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి; విజయనగరంలో ఐద్వా ఆధ్వర్యాన నివాళులర్పిస్తున్న మహిళలు

ఎఫ్‌పిఒల బలోపేతానికి చర్యలు

ప్రజాశక్తి-వంగర

రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఎఫ్‌పిఒ)ల బలోపేతానికి చర్యలు చేపడుతున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జయప్రకాశ్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి తెలిపారు. వంగర వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఎఫ్‌పిఒ సంస్థ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఎఫ్‌పిఒలో ఉన్న రైతులతో పాటు మిగతా రైతులకు కూడా సబ్సిడీతో కూడిన గొర్రెలు, మేకలు, గడ్డి పెంపకం తదితర రుణాలు మంజూరు చేస్తామని వెల్లడించారు. అనంతరం మగ్గూరు గ్రామానికి చెందిన దత్తి వెంకటరావుకు రూ.80 లక్షలతో మంజూరైన గొర్రెలు, మేకల యూనిట్‌ను వారంతా పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వేగిరెడ్డి రాము, ఎపిఎం టి.మంగమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ డైరెక్టర్ జయప్రకాశ్

వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై డ్రోన్లు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై డ్రోన్లు అందిస్తున్నట్లు ఆ శాఖ ఎడి ఎం.శ్యామసుందర్ తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నమో డ్రోన్ దీదీ పథకంపై గ్రామ మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా డ్రోన్ ని మహిళా సంఘాల ద్వారా రాయితీపై ఇస్తూ రైతులకు సేవలు అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమలో ఎపిఎం పక్కి భాగ్యలక్ష్మి, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎడి శ్యామసుందర్

యువత రక్తదానం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఎస్‌బిఐ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటుచేసిన శిబిరంలో యువత రక్తదానం చేశారు. ఎలక్ట్రికల్, ఎసి మెకానిక్ శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థులు 26 మంది రక్తదానం చేశారు. శిక్షణ సంస్థ డైరెక్టర్ జిబివి రమణ రక్తదానం చేసిన యువతను అభినందించారు. జరజాపుపేట సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాదరావు, మహారాజా బ్లడ్ బ్యాంకు ఇన్‌ఛార్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా..

విజయనగరం టౌన్ : భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఎపిజె అబ్దుల్ కలాం బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి చీకటి దివాకర్ ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికీ అత్యున్నత రాజ్యాంగం అందించడంలో అంబేద్కర్ కృషి ఎనలేనిదని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన ముందున్న కర్తవ్యం అని అన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, జమ్ము బంగారం, జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్, బ్లడ్ సెంటర్ నిర్వాహకులు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న చీకటి దివాకర్, అబ్దుల్ రవూఫ్, తదితరులు

వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వాకింగ్ ట్రాక్‌లను పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రజారోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఉపయుక్తంగా ఉండే వాకింగ్ ట్రాక్లను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరి పైనా ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలో ఉన్న చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్ల పరిశుభ్రతకు కమిషనర్ ఆదేశాలతో సిబ్బంది ప్రక్షాళన కార్యక్రమాలను చేపట్టారు. ఉద్యాన శాఖ అధికారి ఉమా భరణి ఆధ్వర్యాన ప్లాంటేషన్ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం వాకింగ్ ట్రాక్‌ల పరిశుభ్రతకు శ్రీకారం చుట్టారు. పెద్దచెరువుకు అనుకుని ఉన్న వాకింగ్ ట్రాక్ వద్ద ప్రత్యేక పనివారలతో పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ వాకర్స్ నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు వాకింగ్ ట్రాక్లలో పారిశుధ్య ప్రక్షాళనకు చర్యలు చేపట్టామన్నారు.

వైభవంగా శ్రీరామ పాదుక పట్టాభిషేకం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక రాజా కళాశాల మైదానంలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే బేబినాయన నిర్వహించిన శ్రీరామ పాదుక పట్టాభిషేకం వైభవంగా సాగింది. చినజీయర్ స్వామి పాల్గొన్న ఈ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. తొలుత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో చినజీయర్ స్వామి, ఎమ్మెల్యే బేబినాయన, రామ్‌నాయన పూజలు చేశారు. కోట నుంచి రాజా కళాశాల మైదానం వరకు శోభాయాత్ర చేపట్టారు. అనంతరం శ్రీరామ పాదుక పట్టాభిషేకం నిర్వహించారు.


వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చినజీయర్ స్వామి, ఎమ్మెల్యే బేబినాయన, రామ్‌నాయన

కెజిపూడిలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడిలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు చెప్పారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి దాసరి లక్ష్మి, మాజీ సర్పంచ్ చల్ల వెంకట్రావు, జనసేన నాయకులు కొండలరావు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

రోడ్డు పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

రోడ్డు పనులు పరిశీలన

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని మొగిలివలస గ్రామంలో చేపడుతున్న రోడ్డు పనులను మండల ప్రత్యేకాధికారి ఎన్.నిర్మలకుమారి.. శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, తర్వితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

B.S.N MEMORIAL COLLEGE OF EDUCATION
Kothavalasa (V&M), Vizianagaram Dist.

B.Ed Management & Spot Quota Admissions (2023-2024 Year)

Applications are called from eligible students (With or without Edcet-2023) for admission into B.Ed course in all methodologies who have completed their gradution in B.A/ B.Com/B.Sc/BBM/B.C.A with 50% for OC and 40% For BC, SC, ST and PH categories. Very few seats are available in CAT-A (SPOT) and CAT-B (MANAGEMENT QUOTA) and EWS Cadidates (Local to AU or SVU)

The application should reach the college on or before 03.04.2024 along with all original certificates and government fee.

Sd/-Principal
Contact :8331997805

IN THE HON'BLE COURT OF THE III ADDL. JUNIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
I.A.113/2023 in O.S.115/2022

Between :
Sri Jasti Vishnuvardhana Rao ...Petitioner/Plaintiff
And
Sri Bangaru Suryanarayana & others ...Respondents/Defendants

NOTICE

To,
R-6 : Sri Bangaru Ramu, S/o. Late Appala Konda, Hindu, aged 32 years, R/at D.No.1-10, Relli Village, Kothavalasa Mandal, Vizianagaram District.

Please take notice that the above named plaintiffs filed the above suit seeking a direction to the defendants for recovery of amount and for other reliefs and I.A.113/2023 for addition of legal heirs and the above I.A. stands posted to **24-12-2024** for your appearance. You have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M.** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
V.S. PAVAN,
Advocate for Petitioner,
Visakhapatnam.
Cell: 9848119594